సాక్షి
కర్నూలు
బుధవారం । 19 । జూలై । 2023



పరివార దేవుళ్లకు పూజలు
శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని ఉసగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వ రునికి, బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా విశేషపూజలు నిర్వహించారు.



కేసీ కాల్వకు నీటి విడుదల
గూడూరు: కర్నూలు నగర ప్రజల తాగు నీటి కోసం సుంకేసుల డ్యాం నుంచి కేసీ కెనాల్‌కు మంగ ళవారం 130 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. డ్యాంలో 0.881 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



గలగల పారేలా..
ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సాగునీటి కాల్వల నిర్వహణపై జలవనరుల శాఖ దృష్టి సారించిం ది. కాలువలు, డిస్ట్రిబ్యూటరీలను బాగు చేసి ప్రతి ఎకరానికి నీరందించనుంది. 8లో

పేద రైతులకు 'పట్టా'భిషేకం



పట్టాలు ప్రతిపాదించిన సాగుభూమి వివరాలు		
నియోజకవర్గం	అనుభవదారులు	భూమి (ఎకరాల్లో..)
పత్తికొండ	793	1,081.10
ఆలూరు	1,017	1,273.62
ఆదోని	202	167.54
మంత్రాలయం	437	511.50
ఎమ్మిగనూరు	717	741.55
పాణ్యం	236	312.83
కోడుమూరు	23	28.48
కర్నూలు	భూమి లభ్యత లేదు	

- త్వరలో భూ పంపిణీ
- కేబినెట్ సమావేశంలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సీఎం వైఎస్ జగన్
- జిల్లాలో 3,425 మందికి 4,116.62 ఎకరాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యర్యంలో అసైన్‌మెంట్ కమిటీల నియామకం
- ఇనాం భూములపై అనుభవందారులైన బీసీ వర్గాలకు న్యాయం చేసేలా చర్యలు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ భూములను సాగు చేస్తూ ఎలాంటి హక్కులు పొందలేని పేద రైతులకు న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అనుభవందారులకు భూపంపిణీ చేయాలని నిర్ణయించింది. రెండు రోజుల క్రితం జరిగిన కేబినెట్ సమావేశంలో భూ పంపిణీకి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. త్వరలోనే విధివిధానాలను ప్రభుత్వం రూపొందించే అవకాశం ఉంది.

జిల్లాలో 3,425 మందికి లబ్ధి
పెండింగ్‌లో ఉన్న అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారం కోసం 2022 ఆగస్టులో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అర్హుల జాబితా రూపకల్పన చేసింది. జిల్లాలోని 3,425 మంది రైతుల ఆధీనంలో ఉన్న 4,116.62 ఎకరాల భూమికి సంబంధించి డీ–పట్టాలు ఇచ్చేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన కొనసాగే అసైన్డ్ కమిటీలు ఆమోదం తెలిపి వివరాలను ప్రభుత్వానికి పంపాయి. ఆయా అసైన్‌మెంట్ కమిటీలు పంపిన వివరాలపై సంతృప్తి చెందిన ప్రభుత్వం రెండు రోజుల క్రితం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడంతో భూ పంపిణీ చేయడం కచ్చితంగా జరుగుతుంది. ఈ క్రమంలో పేదల సాగుచేసుకుంటున్న భూమిపై సర్వహక్కులు సిద్ధిస్తాయి. ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న పేద రైతులకు తడి అయితే రెండున్నర, మెట్ట అయితే ఐదెకరాలకు మించకుండా డీ–పట్టా ఇవ్వనున్నారు.

అర్హుల ఎంపికకు ప్రత్యేక కమిటీ
సాగుభూమికి సంబంధించి రైతులకు పట్టా ఇచ్చేందుకు ప్రత్యేకంగా అసైన్‌మెంట్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిటీ చైర్మన్‌గా జిల్లా ఇన్‌చార్జి మంత్రి వ్యవహరిస్తారు. మెంబర్ కన్వీనర్‌గా జాయింట్ కలెక్టర్, మెంబర్లుగా జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు, ఆర్‌డీఓ ఉంటారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్సీ ఉంటారు. ప్రభుత్వ ప్రకటన అనంతరం వీలైనంత త్వరలో పట్టాలు అందజేసేందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు.

నాడు వైఎస్సార్..నేడు వైఎస్ జగన్
పేదలకు భూ హక్కులు కల్పించే కార్యక్రమాన్ని 14 ఏళ్లగా ఏ ప్రభుత్వం చేపట్టలేదు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో పేదలకు డీ–పట్టాలు ఇచ్చారు. కర్నూలు జిల్లాలో వైఎస్సార్ హయాంలో 6 వేల మందికి పట్టాలు ఇచ్చారు. తరువాత ఆయన తనయుడైన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలోనే ఈ బృహత్తర కార్యక్రమానికి మళ్లీ శ్రీకారం చుట్టారు. సీఎం నిర్ణయంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు భూమి కావాలన్న కొన్నేళ్ల కోరిక నెరవేరనుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీసీ వర్గాలకు బంపర్ ఆఫర్
ఏళ్లగా ఇనాం భూములను అనుభవిస్తున్న అనుభవందారులైన బీసీ వర్గాలకు మంత్రి మండలి మంచి కబురు చెప్పింది. గతంలో చాకలి, మంగలి, ఇతర గ్రామ సేవలకు భూములు ఇచ్చారు. అయితే వాటిపై వారికి ఎలాంటి హక్కులు లేవు. దీంతో వారికి కూడా హక్కులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఆయా వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనుభవదారులకు సంపూర్ణ హక్కులు

అసైన్‌మెంట్ భూముల్లో 20 ఏళ్లగా అనుభవందారులుగా ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వారికి సంపూర్ణ హక్కులు ఇవ్వాలని నిర్ణయించారు. అనుభవంలో ఉన్న భూమిని అత్యవసరసమయాల్లో తాకట్టు పెట్టుకోవడానికి, అమ్ముకోవడానికి, దానం చేసుకోవడానికి హక్కులు కల్పించారు. గతంలో అసైన్‌మెంట్ భూములు అమ్మడానికి వీలు ఉండేది కాదు. దీంతో జిల్లాలో దాదాపు 4 వేల మందికి సంబంధించి ఎలాంటి వివాదాలు లేని 6 వేల నుంచి 8 వేల ఎకరాల వరకు అసైన్‌మెంట్ నిషేధిత జాబితా నుంచి విముక్తి కలిగే అవకాశం ఉంది. అయితే పూర్తి స్థాయి విధివిధానాలు జిల్లా యంత్రాంగానికి అందాల్సి ఉంది. ఆ తరువాతే రైతుల సంఖ్య, పూర్తి స్థాయి విస్తీర్ణంపై తుది నివేదిక వచ్చే అవకాశం ఉంది.

పారదర్శకంగా అర్హుల ఎంపిక



ప్రభుత్వ భూమిని సాగు చేస్తూ హక్కులేని వారికి హక్కులు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం పారదర్శకంగా అనుభవదారులను ఎంపికచేశాం. అలాగే 20 ఏళ్ల అసైన్‌మెంట్ అనుభవందారులకు హక్కులు కల్పించాలని మంత్రిమండలి నిర్ణయించింది. అదే విధంగా ఇనాం భూములపై కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే విధివిధానాలు వచ్చాక ఆ ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేస్తాం.
– నారపురెడ్డి మౌర్య, జేసీ, కర్నూలు

అట్రాసిటీ చట్టంపై వర్క్‌షాప్ నిర్వహించండి

- ఎస్పీకి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ వినతి



జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కర్నూలు : జిల్లాను అట్రాసిటీ రహిత జిల్లాగా మార్చేందుకు ఆ చట్టంపై వర్క్‌షాప్ నిర్వహించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ సభ్యులు సాయిప్రదీప్, నవీన్ ప్రభుదాస్ ఎస్పీ కృష్ణకాంత్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి వారు వినతిపత్రం అందించారు. ప్రతినెలా సివిల్ రైట్స్ డేలో సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లు పాల్గొనేలా చూడాలని వారు వినతిపత్రంలో కోరారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సభ్యులకు అట్రాసిటీ చట్టంపై వర్క్‌షాప్ నిర్వహించాలన్నారు. అలాగే అట్రాసిటీ కొనసాగుతున్న ప్రాంతాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని, బాధితులకు పోలీసులు అండగా ఉండాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌ను సంపూర్ణంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని, నేరాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించకుండా పోలీసు సిబ్బంది పనిచేసేలా చర్యలు తీసుకుంటానని ఎస్పీ ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. డీవీఎంసీ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు రాజశేఖర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్‌ఈ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు డయల్ యువర్ ఎస్‌ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వినియోగదారులు బుధవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య 7382614308 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందాలని సూచించారు.

న్యూస్‌రీల్

కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్‌గా ఎస్.వి.విజయ మనోహరి



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్ పర్సన్‌గా ప్రభుత్వం ఎస్.వి.విజయ మనోహరిని నియమించింది. ఈ మేరకు సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి జీఓ 500 జారీ చేశారు. విజయ మనోహరి కర్నూలు మాజీ శాసనసభ్యుడు ఎస్.వి.మోహన్‌రెడ్డి సతీమణి. ఒకటి, రెండు రోజుల్లో డీసీసీబీ చైర్‌పర్సన్‌గా విజయ మనోహరి పదవీ ప్రమాణం చేసే అవకాశం ఉంది. ఈమె చైర్ పర్సన్‌గా 2024 జనవరి 17 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఇదివరకు చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించిన ఎస్.మహాలక్ష్మి పదవీకాలం ఈ నెల 17తో ముగిసింది. ఈమె హయాంలో జిల్లా సహకార కేంద్రబ్యాంకు లాభాల బాట పట్టింది. పర్సన్ ఇన్‌చార్జి కమిటీలో ఇది వరకున్న గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, సీమ సుధాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వరమ్మ, మూలింటి రాఘవేంద్ర, నాసరి వెంకటేశ్వర్లు సభ్యులుగా కొనసాగనున్నారు. కేడీసీసీ ముఖ్యకార్యనిర్వహణాధికారి పి. రామాంజనేయులు మంగళవారం విజయమనోహరిని మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

బడి బయట పిల్లలను గుర్తించండి

కర్నూలు(సెంట్రల్): బడి బయట ఉన్న పిల్లలను వందశాతం గుర్తించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి హౌసింగ్, ఉపాధి హామీ, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, జగనన్న సురక్ష, విద్యాశాఖపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఇంజినీర్లతో సమీక్షించారు. వలంటీర్ల ద్వారా బడి బయట ఉన్న పిల్లను గుర్తించే సర్వేను జిల్లాలో 95 శాతం పూర్తి చేశారన్నారు. మిగతా ఐదుశాతం కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. బడిబయట పిల్లలందరూ బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో కచ్చితంగా రోజు వారి కన్వర్షన్ జరగాలని, ఇందుకు ఎంపీడీఓలు ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జీరో పురోగతి నమోదు కావడానికి వీల్లేదన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకు సంబంధించి చిప్పగిరి, హొళగుంద, తుగ్గలి, ఆదోని, ఓర్వకల్ మండలాల్లో పురోగతి కనిపించకపోవడంపై కారణమేమిటని ఎంపీడీఓలను ప్రశ్నించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

జిల్లాలో నూతన పర్యాటక ప్రాంతాలకు ప్రతిపాదనలు



గాజుల దిన్నె ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు కల్చరల్: జిల్లాలో నూతన పర్యాటక ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ పేర్కొన్నారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా పర్యాటక శాఖ అధికారులు జిల్లాలోని గాజులదిన్నె, రామజల చెరువు, బనవాసి ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదా కింద ఈ మూడు ప్రాంతాలను నూతన పర్యాటక ప్రాంతాలుగా గుర్తించామన్నారు. వీటి అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేసి నివేదిస్తామన్నారు.

ఈవీఎంల తరలింపు

కర్నూలు(సెంట్రల్): జాతీయ ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికలను ఎప్పుడు నిర్వహించినా సిద్ధంగా ఉండేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఈవీఎంలు, బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తోంది. కలెక్టరేట్‌లోని ఈవీఎంలను అవసరమున్న ఇతర జిల్లాలకు తరలిస్తోంది. నంద్యాలకు 6వేలు, పల్నాడుకు 6 వేలు, సత్యసాయి జిల్లాకు వెయ్యి ఈవీఎంలను పంపింది. అలాగే 3 వేల బ్యాలెట్ బాక్సులను కూడా నంద్యాలకు పంపేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడంతో ఆ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రారంభమైన పురుషోత్తమ మాసం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో మంగళవారం పురుషోత్తమ మాసం పూజలు ప్రారంభమయ్యాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేక అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

మున్సిపల్ స్కూళ్లలో టీచర్ల కొరత లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం

కర్నూలు (సిటీ): ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్ పాఠశాలల్లో టీచర్ల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్) మువ్వా రామలింగం తెలిపారు. మంగళవారం జిల్లాలోని మున్సిపల్ స్కూళ్లలో టీచర్లను సర్దుబాటు చేసే అంశంపై ఎంఈఓలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు, ఆదోని, నంద్యాల మున్సిపాలిటీల పరిధిలోని ప్రతి పాఠశాలలో టీచర్లు ఉండేలా సర్దుబాటు చేస్తున్నామన్నారు. ఆదోని ప్రాంతంలో అత్యధికంగా టీచర్ల కొరత ఉందన్నారు. అదనంగా ఎక్కడైనా టీచర్లు ఉన్నట్లయితే ఆయా మండలాల విద్యాధికారులు రెండు రోజుల్లో పూర్తి వివరాలతో కూడిన నివేదిక అందజేయాలని కోరారు. జిల్లాలో ఇటీవల పదోన్నతులు పొంది రిలీవ్ కానివారిని వెంటనే వారికి కేటాయించిన స్థానానికి పంపించాలన్నారు. ఎంపీడీఓల పరిధిలో ఉన్న మండల విద్యాధికారుల డీడీఓ పవర్‌ను డిప్యూటీ డీఈఓలకు అప్పగిస్తామని జాయింట్ డైరెక్టర్ వెల్లడించారు. సమావేశంలో డీఈఓ రంగారెడ్డి, ఏడీలు శామ్యూల్ పాల్, అనురాధ, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

జేడీని కలిసిన ఆప్టా నాయకులు
విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగంను డీఈఓ ఆఫీస్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక టీచర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజా సాగర్, ప్రధాన కార్యదర్శి ఆర్.సేవాలాల్ నాయక్ కలిశారు. జిల్లాకు అత్యధికంగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరయ్యేందుకు కృషి చేసిన జేడీకి వారు అభినందించారు.


సామాజిక తనిఖీలకు సహకరించండి

- జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో వివిధ శాఖల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీలకు సహకరించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో కన్వర్జెన్సీ శాఖల అధికారులతో సోషల్ ఆడిట్ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ శాఖ, పశుసంవర్ధకశాఖ, నీటిపారుదల శాఖ, సెరికల్చర్, హౌసింగ్ తదితర శాఖల్లో ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కన్వర్జెన్సీ కింద ఆర్‌బీకేలు, గ్రామ సచివాలయాలు, సీసీ రోడ్లు, కాంపౌండ్ వాల్స్, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు తదితర పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఇందులో రూ.131 కోట్ల విలువ పనులకు రికార్డులు ఇవ్వాలన్నారు. ఇది వరకు నిర్వహించిన సామాజిక తనిఖీలకు సంబంధించి రూ.24 కోట్ల వ్యయానికి 6528 అభ్యంతరాలు ఉన్నాయని, ఇందులో రూ.4.58 కోట్ల వ్యయానికి సంబంధించిన అభ్యంతరాలు పరిష్కారమయ్యాయని తెలిపారు. సమావేశంలో డ్వామా విజిలెన్స్ అధికారి శిద్దలింగమూర్తి, కన్వర్జెన్సీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై చాఫ్ కట్టర్లు, పశుగ్రాసం విత్తనాలు

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి దుర్గాప్రసన్నబాబు



డాక్టర్ దుర్గాప్రసన్న బాబు

కర్నూలు(అగ్రికల్చర్): సబ్సిడీపై చాఫ్ కట్టర్లు, పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ దుర్గా ప్రసన్నబాబు తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో కర్నూలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసన్నబాబు పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 40 శాతం సబ్సిడీపై చాఫ్ కట్టర్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 2 హెచ్‌పీ చాఫ్ కట్టర్ల యూనిట్ కాస్ట్ రూ.33,970 ఉండగా రూ.13,588 సబ్సిడీ వస్తుందన్నారు. పశుగ్రాసాల కొరతను అధిగమించేందుకు 75 శాతం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సీఎస్‌హెచ్ –24 జొన్న రకం విత్తనాలు 5 కిలోల కిట్ పూర్తి ధర రూ.460 కాగా సబ్సిడీ రూ.345 ఉంటుందన్నారు. ఆఫ్రికన్‌టాల్ మేజ్ 5 కిలోల కిట్ పూర్తి ధర రూ.340 ఉండగా సబ్సిడీ రూ.255 వస్తుందన్నారు. పశుగ్రాసం విత్తనాలు, చాఫ్ కట్టర్ల కోసం రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలని సూచించారు. 4 నుంచి 8 నెలల పెయ్య దూడలకు బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం చురుగ్గా సాగుతోందన్నారు. మూడు విడతల్లో 20,150 దూడలకు టీకాలు వేస్తామన్నారు.

చిరువ్యాపారులకు ఆర్థిక తోడ్పాటు

- జగనన్న తోడు పథకాన్ని సద్వినియోగం చేసుకోండి
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- చిరు వ్యాపారులకు ఏడో విడత వడ్డీలేని రూ.10 వేల రుణం
- జిల్లాలో 20,516 మంది లబ్ధిదారులకు రూ.57.01 లక్షలు జమ



మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎమ్మెల్యేలు కాటసాని, డాక్టర్ జె.సుధాకర్

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వం చిరువ్యాపారులకు వడ్డీలేని రుణాలు అందజేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి ఏడో విడత కింద జగనన్నతోడు పథకంలో వాయిదాలు సక్రమంగా చెల్లించిన వారికి వడ్డీని రీయింబర్స్‌మెంట్ చేశారు. వర్చువల్‌గా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో చిరువ్యాపారులతో కలిసి కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ జె.సుధాకర్, డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ నాగశివలీల వీక్షించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. చిరువ్యాపారులు వడ్డీ వ్యాపారుల బారిన పడి ఆర్థికంగా చితికిపోకూడదని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న తోడు పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోడ్డు సైడు వ్యాపారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రూ.10 వేలు రుణం ఇప్పిస్తుందన్నారు. తీసుకున్న అప్పును సక్రమంగా వాయిదాల రూపంలో చెల్లిస్తే వడ్డీని తరువాత రీయింబర్స్‌మెంట్ చేస్తుందన్నారు. జిల్లాలో అర్హత ఉన్న చిరువ్యాపారులందరికీ జగనన్నతోడు కింద రుణాలు ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. కోడుమూరు ఎమ్మెల్యే జె.సుధాకర్ మాట్లాడుతూ..నిరుపేదలు, చేతివృత్తుల వ్యాపారాలు చేసుకునే వారికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సర్కారు చేసే సాయాన్ని చిరువ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జగనన్నతోడు కింద ఏడో విడతలో గ్రామీణ ప్రాంతాల్లో 13,476 మంది లబ్ధిదారులకు రూ.37.45 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 7,040 మందికి రూ.19.56 లక్షలను వడ్డీ కింద రీయింబర్స్‌మెంట్ చేసినట్లు చెప్పారు. జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి 20, 516 మందికిగాను రూ.57.01 లక్షలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేసినట్లు చెప్పారు. చిరు వ్యాపారులు వ్యాపారం వృద్ధి చేసుకునేందుకు ఈ పథకం భరోసా ఇస్తుందన్నారు. అనంతరం వారు చిరువ్యాపారులకు మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీధర్‌రావు, ఎల్‌డీఎం రామచంద్రరావు పాల్గొన్నారు.

అప్పు తీసుకోవాల్సిన అవసరం పోయింది



నా భర్త పి.నాగప్రసాద్ ఓ చిట్ ఫండ్ కంపెనీలో గుమాస్తాగా పనిచేస్తున్నారు. మాకు ఇద్దరు సంతానం. వచ్చే ఆదాయం సరిపోక ఏదైనా పని చేసుకోవాలని రూ.20 వేలు అప్పు చేసి టైలరింగ్ షాపు పెట్టాను. ఆ మొత్తాన్ని చెల్లించేందుకు అనేక ఇబ్బందులు పడ్డాను. వలంటీర్ ద్వారా జగనన్న తోడు పథకం గురించి తెలుసుకుని దరఖాస్తు చేసుకున్నాను. మంజూరైన రూ.10 వేల రుణాన్ని సక్రమంగా చెల్లించడంతో వడ్డీ తిరిగి జమ అయింది. ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తుండటంతో బయట అప్పులు తీసుకోవాల్సిన అవసరం పోయింది. – పి.సుజాత, కల్లూరు ఎస్టేట్

చిరు వ్యాపారులకు జగనన్న అండ



నేను రోడ్డుపై బండి పెట్టుకొని పండ్ల వ్యాపారం చేస్తాను. చిన్న వ్యాపారమైనప్పటికీ రోజు పెట్టుబడి కోసం డబ్బులు అవసరం. గతంలో బయట వడ్డీకి అప్పులు చేసి ఇబ్బంది పడేవాళ్లం. పండ్ల వ్యాపారంలో లాభాలు పెద్దగా ఉండవు. ఒక్కోసారి పండ్లు కొనకపోతే నష్టపోవాల్సి వస్తుంది. అప్పుడు బయట వ్యాపారుల దగ్గర తీసుకున్న అప్పు చెల్లించడం కష్టం. నేను జగన్నతోడు కింద వడ్డీ లేకుండా రూ.10 వేల రుణం తీసుకుని చెల్లించాను. దీంతో మళ్లీ బ్యాంకు వాళ్లు పిలిచి అప్పు ఇచ్చారు. ఈ పథకం చిరు వ్యాపారులకు అండగా నిలుస్తుంది. – పి.మంగమ్మ, బుధవారపేట, కర్నూలు

న్యాయవాదులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న లోక్ అదాలత్ జడ్జి వెంకటనాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): నిత్యం కేసుల పనిలో బిజీ ఉండే న్యాయవాదులు తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకోవాలని లోక్ అదాలత్ జడ్జి సి.హెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ కార్యాలయంలో న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి బీపీ, షుగర్, గుండె, కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రజా వినియోగ సేవల కోసం శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకటహరినాథ్, పారా లీగల్ వలంటీర్ కె.జి.గంగాధర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.నాగభూషణం నాయుడు, శాంతిరామ్ వైద్యశాల వైద్యులు, మెడి కవర్ వైద్యులు కె.వరప్రసాద్, సమీరా బి. చిన్నిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజా రవాణా శాఖను లాభాల్లోకి తెద్దాం

కోవెలకుంట్ల: ప్రజా రవాణా శాఖ లాభాల బాటలో పయనించేందుకు కృషి చేస్తున్నట్లు రీజనల్ మేనేజర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోను తనిఖీ చేశారు. గ్యారేజీని పరిశీలించి బస్సుల కండీషన్‌ను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్టాండ్‌ను తనిఖీ చేసి వసతులను ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆయా రూట్లలో బస్సులు నడుపుతున్నామన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి క్షేమంగా గమ్యాలను చేరుకోవాలన్నారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమన్నారు. ఆయన వెంట డిపో మేనేజర్ తిరుపతయ్య, ఎస్‌టీఐ కిషోర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఎన్‌ఎంయూ జిల్లా సెక్రటరీ శివరాం, డిపో అధ్యక్షుడు నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో తేలికపాటి వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు కర్నూలు జిల్లాలో 11 మండలాలు, నంద్యాల జిల్లాలో 16 మండలాల్లో వర్షాలు పడ్డాయి. కర్నూలు జిల్లా మొత్తంగా సగటున 1.1, నంద్యాల జిల్లాలో సగటున 1.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంత్రాలయంలో 8.2, ఆత్మకూరులో 8.0, బేతంచెర్లలో 6.2 మిల్లీ మీటర్ల ప్రకారం వర్షాలు కురిశాయి. కాగా మంగళవారం ఉదయం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి.

ఎద్దుల బండిని ఢీకొన్న లారీ

- ఇద్దరు రైతులు, ఎద్దులకు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన ఎద్దు

తుగ్గలి: ఎద్దుల బండిని వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో రైతులు, ఎద్దులు తీవ్రంగా గాయపడ్డాయి. జొన్నగిరికి చెందిన రైతులు శేఖర్, నాగన్నతో పాటు మరో ఇద్దరు ఎద్దుల బండిలో పొలానికి వెళుతుండగా గుత్తి వైపు నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు రైతులు, ఎద్దులు తీవ్రంగా గాయపడ్డాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

గలగల పారేలా..

- సాగు నీటి కాలువలకు మహర్దశ
- ప్రతి ఎకరానికి నీరందించేలా జగన్ సర్కారు చర్యలు
- ఎల్‌ఎల్‌సీ, జీడీపీ, జీఆర్‌పీ, తెలుగుగంగ, కేసీ పరిధిలో పనులకు నిధుల మంజూరు
- డిస్ట్రిబ్యూటరీల పట్టర్స్, ప్రధాన కాలువలకు మరమ్మతులు
- నామినేషన్‌కు స్వస్తి.. టెండర్ల ద్వారా పనులు
- కాలువల నిర్వహణను పట్టించుకోని గత సర్కార్



కేసీ కాలువలో పూడిక తీస్తున్న దృశ్యం



గాజులదిన్నె కాల్వ పరిధిలో...

కర్నూలు సిటీ: ప్రతి ఎకరానికి నీరందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోని కాలువలు, డిస్ట్రిబ్యూటరీలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే వాటి మరమ్మతులకు నిధులు కేటాయించడంతో జిల్లాలో ఆయా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వాలు సాగు నీటి కాలువల నిర్వహణను గాలికి వదిలేశాయి. దీంతో ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందని పరిస్థితి ఏర్పడింది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నీరు–చెట్టు పేరుతో కోట్లాది రూపాయలు దోచుకున్నారు తప్ప కాలువల షట్టర్లకు, నిర్వహణకు పైసా నిధులు ఖర్చు చేయలేదు. ఈ కారణంగా మరమ్మతులకు నోచుకోని డిస్ట్రిబ్యూటరీల షట్టర్ల ద్వారా ఆయా తూముల కింద ఉండే చివరి ఆయకట్టుకు నీరందక సాగు తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో జల వనరుల శాఖ అవసరమైన చోట మరమ్మతులు, కాల్వల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపునకు చర్యలు చేపట్టింది. కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ కమిటీ సలహా, సూచనల మేరకు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని సాగు నీటి కాలువలకు నిర్వహణకు నిధులు మంజూరయ్యాయి. జిల్లాలోని కర్నూలు–కడప కాలువ, గాజులదిన్నె (సంజీవయ్యసాగర్)ప్రాజెక్టు, తుంగభద్ర దిగువ కాలువ, తెలుగుగంగ కాలువ, శ్రీశైలం కుడి బ్రాంచ్ కెనాల్, గురురాఘవేంద్ర ప్రాజెక్టులోని స్కీమ్‌ల పరిధిలోని ఆయకట్టుకు సైతం నిధులు మంజూరయ్యాయి. అయితే, ఈ నిధులు టీడీపీ హయాంలో లాగా దుర్వినియోగం కాకుండా జగన్ సర్కారు జాగ్రత్తలు తీసుకుంది.

పారదర్శకంగా పనులు

ఉమ్మడి జిల్లాకు తుంగభద్ర, కృష్ణా జలాలు ప్రధాన జల వనరులు. ఆ వనరులను వాడుకునేందుకు సాగు నీటి కాలువలు ఉన్నాయి. అయితే, ఆ కాల్వలకు నిర్వహణకు కావాల్సిన నిధులు లేకపోవడంతో నిర్దేశిత ఆయకట్టుకు నీరు అందడం లేదు. నీరు పారుదల వ్యవస్థలో లోపాలను సరిదిద్దేందుకు కాడా(కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్)కమిటీ సలహాలతో సర్కారు నిధులు మంజూరు చేసింది. కేసీ కాలువ కింద 435 పనులకు రూ.48.47 కోట్లు, తెలుగుగంగా పరిధిలో 26 పనులు రూ.4.66 కోట్లు, ఎస్ఆర్‌బీసీ సర్కిల్–1 పరిధిలో రెండు పనులకు రూ.11 లక్షలు, గాజులదిన్నె (దామోదరం సంజీవయ్య సాగర్)ప్రాజెక్టు 20 పనులు రూ.3.60 కోట్లు, తుంగభద్ర దిగువ కాలువ పరిధిలో 18 పనులు రూ 2.67 కోట్లు, గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలోని వివిధ ఎత్తిపోతల పథకాల్లో 13 పనులకు రూ.98.84 లక్షలు మంజూరు చేశారు. ఈ పనులన్నీ దాదాపు అత్యధిక శాతం రూ.10 లక్షలలోపు ఉన్నాయి. ఇదే రకమైన పనులు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వారి పార్టీ కార్యకర్తలకు నామినేషన్‌పై కట్టబెట్టేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి చెప్పి టెండర్లు పిలిచి అందులో అర్హత సాధించిన వారితో పనులు చేయిస్తోంది.

సీడబ్ల్యూసీ సూచనల మేరకు పనులు

దేశంలో దశాబ్దాల పాటు చరిత్ర ఉన్న సాగు నీటి కాలువల కింద భారీగా ఆయకట్టు తగ్గిన వాటిపై 2019లో సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) సర్వే చేసింది. జిల్లాలో ఆరు దశాబ్దాలకుపైగా చరిత్ర ఉన్న తుంగభద్ర దిగువ కాలువ(ఎల్‌ఎల్‌సీ) కింద సాగు అవుతున్న ఆయకట్టు, తుంగభద్ర జలాశయంలో ఉన్న కేటాయింపులు, అందుతున్న నీరు, టీబీ డ్యాంలో నీటి లభ్యత తదితర అంశాలపై సర్వే జరిగింది. ఈ సర్వే రిపోర్టు మేరకు 2019లోనే తుంగభద్ర దిగువ కాలువ ఇంజినీర్లు 250 కి.మీ నుంచి 324 కి.మీ వరకు ఉన్న షట్టర్లకు రూ.14.27 కోట్లతో అంచనాలు వేసి టెండర్ల ద్వారా మరమ్మతులు చేయించారు. తాజాగా ఇదే విధానంలో కాలువల నిర్వహణ పనులు చేపట్టారు.

పకడ్బందీగా పనులు



జిల్లాలో సాగు నీటి కాలువల నిర్వహణకు చాలా ఏళ్ల తరువాత పక్కాగా పనులు జరుగుతున్నాయి. కేసీ కెనాల్ పరిధిలో 435 పనులతో పాటు ఎల్‌ఎల్‌సీ, జీడీపీ కింద పనులు జరుగుతున్నాయి. ఒక వైపు కాలువల్లో పేరుకోపోయిన పూడిక, మరో వైపు కాంక్రీట్ పనులు టెండర్ల ద్వారా అప్పగించాం. పనులు చేసిన వాటికి వెంటనే రికార్డు చేసి బిల్లులకు ప్రపోజ్ చేస్తున్నాం. ఇంజినీర్లు కాల్వలపై పర్యవేక్షిస్తూ పనులు దగ్గర ఉండి చేయిస్తున్నారు. – రెడ్డి శేఖర్ రెడ్డి, జల వనరుల శాఖ, పర్యవేక్షక ఇంజినీర్

ఐసీడీఎస్‌లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): జిల్లాలోని ఆరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న మెయిన్, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు ఆయాల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారత అధికారిణి నిర్మల తెలిపారు. ఏడు మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలు, రెండు మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 34 ఆయాల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు పదవ తరగతి పాసై, ఈ నెల 1వ తేదీకి 21 సంవత్సరాలు నుంచి 35 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. పెళ్లి అయి అదే గ్రామంలో నివాసం ఉన్న వారు అర్హులని, నియామకంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించబడుతుందన్నారు. దరఖాస్తు వెంట ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను (సెల్ఫ్ అటెస్టెడ్ చేయవలెను) జత పరిచి సంబంధిత సీడీపీఓ కార్యాలయాల్లో ఈనెల 18 నుంచి 22వ తేదీ సాయంత్రంలోగా అందజేయాలన్నారు. ఖాళీల వివరాలకు సంబంధించి సంబంధిత సీడీపీఓ కార్యాలయాల్లో సంప్రదించాని. పూర్తి వివరాలకు http//:nandyal.ap.gov.inలో పరిశీలించాలన్నారు.

ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుకు..

ఐసీడీఎస్ బలోపేతం చేసి పోషణ స్థాయిని మెరుగు పరిచే ప్రాజెక్టు ఎస్ఎస్ఎం/పోషణ్ అభియాన్ జిల్లా స్థాయిలో ఖాళీగా ఉన్న ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుకు కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీడీ నిర్మల తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 19 నుంచి 25వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తులు సంబంధిత కార్యాలయంలో అందించాలన్నారు.

'స్టాఫ్ నర్స్'ల నియామకానికి వేళాయె!

- 313 పోస్టుల భర్తీకి చర్యలు
- ఈ నెల 21, 22న కౌన్సెలింగ్



కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత అనే సమస్యే లేకుండా చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్టాఫ్‌నర్స్‌ల నియామకాలను పెద్ద ఎత్తున చేపడుతోంది. ఫలితంగా అర్హులైన నిరుద్యోగులు ఉద్యోగులుగా మారుతున్నారు. ఇప్పటికే కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 (రాయలసీమ జిల్లాలు) పరిధిలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామకాలు పెద్ద సంఖ్యలో జరిగాయి. మళ్లీ అదే స్థాయిలో కొత్త నియామకాలు జరుగనున్నాయి.

కొత్తగా 313 నియామకాలు

ప్రభుత్వం కొత్తగా 313 స్టాఫ్‌నర్స్ నియామకాలను చేపడుతుంది. ఇప్పటికే వచ్చిన 11,120 దరఖాస్తుల నుంచి అర్హులైన అభ్యర్థులను రాయలసీమలోని 8 జిల్లాల్లో గల ప్రభుత్వ ఆసుపత్రుల్లో నియమించనున్నారు. మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) పరిధిలో 90, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆధ్వర్యంలో (నంద్యాల మెడికల్ కాలేజ్, తిరుపతి మెటర్నిటీ ఆసుపత్రి) 149, ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌లో 74 నియామకాలను చేపడుతున్నారు. ఇందుకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 21, 22వ తేదీల్లో కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్ తెలిపారు.



డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్

రెవెన్యూ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ సచివాలయాల్లో పని చేస్తున్న 11 మంది వార్డు రెవెన్యూ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. బుధవారం సాయంత్రం నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన ఇబ్బందులు రాకుండా ఈ బాధ్యతలు అప్పగించినట్లు అందులో పేర్కొన్నారు.

అహోబిలేశుని హుండీ ఆదాయం రూ. కోటి

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి హుండీ ఆదాయం రూ. కోటికి పైగా వచ్చింది. ఎగువ, దిగువ అహోబిల క్షేత్రాల్లో భక్తులు సమర్పించిన కానుకలను రెండు రోజులుగా లెక్కిస్తున్నారు. దిగువ అహోబిలం క్షేత్రంలో సోమవారం నుంచి ప్రారంభమైన హుండీ లెక్కింపు మంగళవారం పూర్తయింది. ఎగువ అహోబిలంలో రూ. 68,93,091 రాగా, దిగువ అహోబిలంలో రూ. 31,28,468 ఆదాయం వచ్చినట్లు ఏఈవో సంపత్ తెలిపారు.

రెండున్నరేళ్లుగా పంచాయతీ కార్యదర్శి విధులకు గైర్హాజరు

- ఇంతకాలం పట్టించుకోని అధికారులు

ఆలూరు: ఒక పంచాయతీ కార్యదర్శి సుమారు రెండున్నర సంవత్సరాలకు పైగా విధులకు గైర్హాజరు అవుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. గత మార్చి నెలలో ప్రస్తుత ఎంపీడీఓ విషయాన్ని జెడ్పీ సీఈఓ దృష్టికి తీసుకెళ్లినా నాలుగు నెలలుగా గోప్యంగా ఉంచడం గమనార్హం. వివరాలివీ.. చిప్పగిరి మండలం కుందనగుర్తి గ్రామానికి చెందిన నెట్టప్ప ఆ మండలంలోని నేమకల్లు, బెల్డోణ, గుమ్మనూరు, నంచర్ల గ్రామాల్లో 2015 నుంచి 2018 వరకు పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. 2019 డిసెంబర్ 10న ఆలూరు మండలం హాళేబీడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. 2020 డిసెంబర్ 20వ తేదీ వరకు విధుల్లో ఉన్న ఆయన.. ఆ తర్వాత ఎవరికీ సమాచారం ఇవ్వకుండా గైర్హాజరు అవుతున్నారు. 2023 మార్చి 22న ఆలూరు ఎంపీడీఓ అల్లాబకాష్ విషయాన్ని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి దృష్టికి లేఖ ద్వారా తీసుకెళ్లారు. అయితే ఇప్పటి వరకు ఆయన విధులకు ఎందుకు గైర్హాజరు అవుతున్నారు? అసలు ఆయన ఎక్కడున్నారు? కుటుంబ సభ్యుల నుంచి సమాచారం సేకరించారా? పోలీసులకు ఫిర్యాదు చేశారా? అనే విషయాలకు అధికారుల నుంచి స్పందన కరువైంది. రెండు సంవత్సరాలకు పైగా ఒక ఉద్యోగి విధులకు హాజరు కాకపోయినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

పూల కోసం వెళ్లిన బాలికపై అత్యాచారం

జూపాడుబంగ్లా: పూలు కోసుకోవడానికి వెళ్లిన బాలికపై అత్యాచారం చేసిన ఘటన మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో మూడు వారాల క్రితం చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించి బాధితురాలి తండ్రి తెలిపిన వివరాలు ఇవీ.. 17 ఏళ్ల బాలిక తల్లిదండ్రులకు చేదోడుగా ఇంటి వద్దే ఉంటోంది. ఇదే గ్రామానికి చెందిన ఈశ్వరయ్య కొడుకు సిపాయి హరికుమార్‌గాడు బాలికపై కన్నేశాడు. ఎలాగైనా బాలికను లోబర్చుకోవాలని మూడు వారాల క్రితం తమ ఇంటివద్ద పూలు ఉన్నాయని, తెంపుకెళ్లమని చెప్పాడు. అతని మాటలు నమ్మి ఇంటివద్దకు వెళ్లిన బాలికను బలవంతంగా లోనికి లాక్కెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెబితే 'నీతో పాటు అందరినీ చంపేస్తాను' అని బెదిరించాడు. ఇంటికి చేరుకున్న బాలికకు రక్తస్రావం అవుతుండగా తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. అప్పటికీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో బాలికను నిలదీయగా జరిగిన ఘటనను తెలిపింది. ఈనెల 16న బాలికను వెంటబెట్టుకొని జూపాడు బంగ్లా ఎస్ఐ వెంకటసుబ్బయ్యకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే మూడు రోజులైనా కేసు నమోదు చేయకపోవటం.. తమ బిడ్డపై అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకోకపోవడంతో మంగళవారం బాధిత కుటుంబం మరోసారి ఎస్ఐని కలిసింది. న్యాయం చేయకపోతే ఉన్నతాధికారులను కలుస్తామని చెప్పడంతో అప్పటికప్పుడు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై విలేకరులు ఎస్ఐ వెంకటసుబ్బయ్యను వివరణ కోరగా తాము చేయాల్సింది చేస్తాం.. మీరు రాసుకునేది రాసుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. తన అనుమతిలేకుండా విలేకరులు పోలీసుస్టేషన్‌లోకి రావద్దంటూ హుకుం జారీ చేయడం గమనార్హం.

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించండి

- డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య



కె.మార్కాపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల్లో పాల్గొన్న డీఎంహెచ్ఓ

కల్లూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్ఓ) డాక్టర్ రామగిడ్డయ్య సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం ఆయన కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యానికి సంబంధించిన జాతీయ కార్యక్రమాలను వందశాతం పూర్తి చేసి యాప్‌లలో నమోదు చేయాలన్నారు. వారానికి ఒకసారి మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. అలాగే ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కె.మార్కాపురం గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ బాలమురళీకృష్ణ, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటే రిజిస్ట్రేషన్ సేవలు

- డీఆర్ఓ నాగలింగేశ్వరరావు



అవగాహన కల్పిస్తున్న డీఆర్ఓ నాగలింగేశ్వరరావు

ఓర్వకల్లు: ప్రజలు తమ ఇంటి ముంగిటే రిజిస్ట్రేషన్ సేవలు పొందే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి నాగలింగేశ్వరరావు అన్నారు. మంగళవారం హుసేనాపురం సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల సబ్ రిజిస్ట్రార్ జయవాణి ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. స్టాంపుల కొరతను అధిగమించేందుకు ఈ స్టాంపింగ్‌ను తీసుకొచ్చిందన్నారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో లభించే ఈసీలు, నకళ్లు సమీపంలోని సచివాలయాల్లో పొందవచ్చన్నారు. ఆస్తుల క్రయ, విక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు కూడా వాటిలోనే చేసుకోవచ్చున్నారు. ప్రజలు తమ స్థిర, చరాస్తులను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో న్యాయపర సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయన్నారు. సదస్సులో గ్రామ రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు ఇక విద్యుత్ డివిజన్

- ఉత్తర్వులు జారీ చేసిన సీఎండీ
- ఆగస్టు 1 నుంచి అమల్లోకి తెచ్చేందుకు అధికారుల కసరత్తు



ఎమ్మిగనూరు విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కొత్తగా ఆపరేషన్స్ డివిజన్ కార్యాలయాన్ని ఎమ్మిగనూరులో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు ఇటీవలే ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో 22 సెక్షన్లు (మండలాలు) ఉన్న ఆదోని డివిజన్‌ను విడదీసి రెండుగా మార్చనున్నారు. ఆగస్టు 1 నుంచి ఎమ్మిగనూరు విద్యుత్ డివిజన్ సేవలు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎమ్మిగనూరులో కార్యాలయం ఏర్పడితే వినియోగదారుల సేవల్లో జాప్యం తగ్గడంతో పాటు పనులు వేగవంతం కానున్నాయి.

ఎమ్మిగనూరులో డివిజన్ కేంద్రం ఇలా

ఉమ్మడి కర్నూలు జిల్లా (సర్కిల్)లో ఐదు ఆపరేషన్స్ డివిజన్లు ఉన్నాయి. పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఆదోని డివిజన్ అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. దీనిపై దృష్టి సారించిన ప్రభుత్వం రెండుగా విభజించి, సేవలందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి జూన్ 26న ఉత్తర్వులు జారీ చేశారు. డివిజన్ ఏర్పడితే కోడుమూరు, సి. బెళగల్ సమీపంలోని ప్రజలు తమ పనుల కోసం ఆదోనికి వెళ్లాల్సిన అవసరం లేదు.

ఎమ్మిగనూరులోకి గూడూరు సబ్ డివిజన్

ఆదోని డివిజన్‌లో ప్రస్తుతం ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ సబ్ డివిజన్లు ఉన్నాయి. ఇందులో మొత్తం 22 సెక్షన్లు (ఏఈ పరిధి ప్రాంతం) ఉండగా 4.74 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 76 వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ సర్వీసులున్నాయి. ఎమ్మిగనూరు, మంత్రాలయంతో పాటు కర్నూలు రూరల్స్ డివిజన్‌లో ఉన్న గూడూరు సబ్ డివిజన్‌ను విడదీసి ఎమ్మిగనూరులో విలీనం చేయనున్నారు. దీంతో గూడూరుతో పాటు కోడుమూరు, సీ.బెళగల్ మండలాలు ఎమ్మిగనూరు డివిజన్‌లో కలవనున్నారు.

చకచకా ఏర్పాట్లు..

ఆగస్టు 1వ తేదీ నుంచి కొత్త డివిజన్ సేవలు అమల్లోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవలే కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌ను సందర్శించి, డివిజన్ కార్యాలయం ఏర్పాటు కోసం భవనాలు పరిశీలించారు. అక్కడి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యాలయం ఏర్పాటు చేసేందుకు భవనం లభిస్తే వచ్చే నెల నుంచే కార్యకలాపాలు ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారుల సూచనలు, ఆదేశాల మేరకు చర్యలు చేపడుతామని స్థానిక అధికారులు పేర్కొన్నారు.

విభజన తరువాత డివిజన్ల వారీగా మండలాలు (సెక్షన్లు)

ఎమ్మిగనూరు డివిజన్‌లోని సెక్షన్లు
ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు రూరల్స్, పెద్దకడుబూరు, మంత్రాలయం, కోసిగి, గూడూరు, సి. బెళగల్, కోడుమూరు, హాలహర్వి, పత్తికొండ, తుగ్గలి, దేవనకొండ, మద్దికెర

ఆదోని డివిజన్ సెక్షన్లు
ఆదోని–1, ఆదోని–2, ఆదోని–3, కౌతాళం, ఆదోని రూరల్స్ ఈస్ట్, ఆదోని రూరల్స్ వెస్ట్, హొళగుంద, ఆలూరు, చిప్పగిరి, ఆస్పరి

కర్నూలు రూరల్స్ డివిజన్ సెక్షన్లు
ఆత్మకూరు, ఆత్మకూరు రూరల్, శ్రీశైలం, నున్నిపెంట, నందికొట్కూరు, నందికొట్కూరు రూరల్స్, జూపాడుబంగ్లా